క్లుప్తంగా

దుర్గాలమ్మ జాతర నేడు



రాంబిల్లి : వాడనర్సాపురంలో గురువారం దుర్గాలమ్మ అమ్మవారి జాతరను నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వాడనర్సాపురం సహా పరిసర గ్రామాల భక్తులు దుర్గాలమ్మ అమ్మవారి జాతరను నిర్వహించుకుంటారు. ఈ గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేస్తారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

నేడు పైడితల్లమ్మ జాతర

ఎస్.రాయవరం : ఉప్పరాపల్లి గ్రామంలో గురువారం శ్రీ పైడితల్లమ్మ జాతర గురువారం ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ ఇలవేల్పుగా కొలిచే ఈ అమ్మవారి జాతరను ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన యువత పోటా పోటీగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధనకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తోటాడలో 'గడప గడపకు' నేడు

మునగపాక : మండలంలోని తోటాడలో గురువారం ఉదయం 6 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కన్నబాబు రాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ లబ్ధిని వివరించడంతో పాటు ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అచ్చియ్యనాయుడు కోరుతున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోటవురట్ల : మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు జి.సురేష్‌బాబు తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా చెట్ల నరికివేత పనుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులను తనిఖీ చేస్తున్న వైద్యాధికారిణి పద్మప్రియ

పాయకరావుపేట : పట్టణంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు ప్రతి నెలా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు సరఫరా చేయడంతో పాటు సూచనలు, సలహాలు అందిస్తున్నట్టు వైద్యాధికారిణి వి.పద్మప్రియ తెలిపారు. బుధవారం 50 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు.

పోషకాహార పంపిణీ



కె.వెంకటాపురంలో పోషకాహారంతో లబ్ధిదారులు

కోటవురట్ల: కె.వెంకటాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషకాహారం పంపిణీ చేశారు. లబ్ధిదారులకు పాలు, గుడ్లు, చిక్కీలు అందజేసి పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. ఇంట్లో లభించే కూరగాయలు, పప్పు దినుసులతోనే తక్కువ ఖర్చుతో పోషకాహారాన్ని తయారు చేసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వం తల్లీ బిడ్డా క్షేమం కోసం పౌష్టికాహారాన్ని అందిస్తోందని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సత్యవతి, రమణి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోటవురట్ల: ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం 2023–24 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలోకి ప్రవేశాలకు రెండో విడత దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంఈవో పి.అప్పారావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లోకి ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నారని, ఈ నెల 15వ తేదీలోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601
సాక్షి

అల జగనన్న కాలనీలో..

- సొంతింటి కల నెరవేరిన వేళ
- పేదల కళ్లల్లో కాంతులు..



కోటవురట్లలో వైఎస్సార్ జగనన్న కాలనీ



జగనన్న కాలనీలో ఓ ఇల్లు

కోటవురట్ల: ఎన్నో ఏళ్లుగా పడుతున్న వేదనను మరిపించి గుండెల నిండా సంతోషం నింపారు..ఇది నా సొంతిల్లు అనే భావన ఎంతో ధైర్యాన్ని ఇస్తుండగా మరో పక్క అంతులేని ఆనందాన్ని ఇస్తోంది..అద్దె కట్టలేక అవస్థలు పడుతూ జీవించిన రోజులన్నీ ఓ పీడ కల అనిపిస్తోంది..ఇంటి స్థలమే లేనపుడు ఇక ఇల్లు కట్టడం గురించి ఆలోచన ఎలా వస్తుంది..జీవితంలో సొంతింటి కల నెరవేరుతుందని అనుకోలేదు..జగనన్న కల్పించిన ఈ అవకాశం ఆ దేవుడే ఇచ్చాడనుకుంటున్నాం..ఇదీ వైఎస్సార్ జగనన్న కాలనీలలో ఇళ్లు నిర్మించుకున్న ఎందరో పేదల మనోగతం..మంచి రోజులు కావడంతో వైఎస్సార్ జగనన్న కాలనీలు గృహ ప్రవేశాలతో సందడిగా మారిపోతున్నాయి. సొంతింట్లో పాలు పొంగిస్తే ఆ కిక్కే వేరయ్యా.. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాలలోని వైఎస్సార్ జగనన్న కాలనీలలో లబ్ధిదారులు అదే అనుభూతిని పొందుతున్నారు. కొందరు ఇంటి నిర్మాణాలను పూర్తి చేసి శుభ ముహూర్తాన గృహ ప్రవేశాలు చేస్తే మరికొందరు చకచకా ఇళ్లు నిర్మించే పనిలో ఉన్నారు. ఇంకొందరు ఇళ్లు కట్టేందుకు తటపటాయిస్తుండగా ప్రభుత్వం మీకు సహకారం ఇస్తోంది, ఏ సమస్య అయినా మాతో చెప్పండి మేమున్నామంటూ అధికారులు అవగాహన కల్పించి ప్రోత్సాహం ఇస్తున్నారు. మండల స్థాయి అధికారుల బృందం ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్వహించి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. దాంతో ప్రస్తుతం జోరుగా ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. మండలంలో 25 గ్రామ పంచాయతీల పరిధిలో 37 లే అవుట్లలో వైఎస్సార్ జగనన్న కాలనీలు తయారయ్యాయి. 1610 మంది లబ్ధిదారులు ఉండగా 1150 మందికి ఇంటి స్థలాల పట్టాలు ఇచ్చారు. 460 మంది తమ సొంత స్థలాల్లో ప్రభుత్వ సహాయంతో ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ప్రస్తుతం 251 మంది ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 62 మంది లబ్ధిదారులు పాలు పొంగించి తమ సొంతింటి కలను నెరవేర్చుకున్నారు.

విద్యుత్ మీటర్లతో సహా..

రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న కాలనీలలో ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి ఆర్థిక సహాయం ఇవ్వడమే కాకుండా విద్యుత్ కనెక్షన్‌ను కూడా ఉచితంగా ఇస్తోంది. ఇంటి నిర్మాణం పూర్తి కాగానే కొత్త మీటరు వేసి సర్వీసు వైర్‌తో సహా ప్రభుత్వమే అందిస్తోంది. ఇలా 99 మందికి విద్యుత్ కనెక్షన్లు కూడా పూర్తయ్యాయి. ఇంకా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు అవగాహన కల్పించి ప్రోత్సాహం ఇస్తున్నారు. అన్ని లే అవుట్లలో విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు. లే అవుట్‌లోని లబ్ధిదారుల సంఖ్యను బట్టి రెండేసి మోటార్లు ఏర్పాటు చేశారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగానే ఇంటర్నల్ రోడ్లు పూర్తి చేసి మొక్కలు నాటి ఆహ్లాద వాతావరణం కల్పించనున్నారు.

మా కల నెరవేరింది..



ఇంటి స్థలం, ఆర్థిక స్తోమత లేక ఇప్పటి వరకు ఇల్లు కట్టుకోలేదు. జగనన్న మాకు ఆ అవకాశాన్ని కల్పించారు. చెప్పలేని సంతోషంగా ఉంది. ఆ దేవుడే జగనన్న రూపంలో మాకు సొంతిల్లు కల్పించాడు. ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– జామి నాగమణి, కుమ్మరివీధి, కోటవురట్ల

అందమైన ఇల్లు సమకూరింది



ఈ జీవితంలో సొంతంగా ఇల్లు కట్టుకుంటామను కోలేదు. అసలు ఆ ఊహే లేదు. జగన్‌బాబు స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకునేందుకు కూడా ఆర్థిక సహాయం అందించారు. మేం కూడబెట్టుకున్న కొంత నగదు కలిపి అందంగా ఇల్లు కట్టుకున్నాం. అధికారులు మాకు ఎంతో సహకరించారు. దాంతో తొందరగా ఇంటి నిర్మాణం పూర్తి చేశాం.

– అనకాపల్లి కాంతం, కుమ్మరివీధి, కోటవురట్ల

జోరుగా పారిశుధ్య పనులు, రోడ్ల నిర్మాణం



ఉద్దండపురంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు

నక్కపల్లి : మండలంలో పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంచాయతీ వారు యుద్ధ ప్రాతిపదికన ఈ పనులు చేపట్టారు. కాలువల్లో పూడికతీత, చెత్త తొలగింపు, క్లోరినేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. రమణయ్యపేట తీనార్ల, నెల్లిపూడి, గుల్లిపాడు, ముకుందరాజుపేట, నక్కపల్లి తదితర గ్రామాల్లో గత రెండు రోజుల నుంచి గ్రామాల్లో పారిశుధ్య కార్మికులతో ఈ పనులు జరుగుతున్నాయి. వైరల్ జ్వరాలు, అతిసార వంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా ఈ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించినట్టు ఎంపీడీవో సీతారామరాజు ఆదేశాల మేరకు పారిశుధ్య పనులు చేపడుతున్నామని సర్పంచ్ కర్రి శ్రీనివాస్ తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించామని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో తడి పొడి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి పంచాయతీలోను చేపట్టాల్సిందేనన్నారు.

ఎంపీటీసీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం

మండలంలో పలుగ్రామాల్లో మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నట్టు ఎంపీడీవో తెలిపారు. ఉద్దండపురంలో సీసీ రోడ్లు, దేవవరం శివారు చినరామభద్రపురానికి సీసీ డ్రెయినేజీల నిర్మాణానికి నిధులు కేటాయించామన్నారు. ఉద్దండపురంలో పనులు పూర్తికావచ్చాయని ఎంపీటీసీ సభ్యుడు బచ్చలరాజు తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, సచివాలయాల ఆర్‌బీకేల నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని ఎంపీడీవో తెలిపారు.

విద్యార్థులు అనర్గళంగా ఇంగ్లిష్‌లో మాట్లాడాలి



విద్యార్థులకు కథలు వినిపిస్తున్న దృశ్యం

పాయకరావుపేట : ప్రతి విద్యార్థి తెలుగుతో పాటు ఇంగ్లిష్‌లో కూడా అనర్గళంగా మాట్లాడాలని పలువురు విశ్రాంత ఉద్యోగులు అన్నారు. పట్టణంలో శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న విజ్ఞాన శిబిరాల సందర్భంగా పలువురు విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలు చదవడం, రాయడంతో పాటు క్రీడలు, యోగా, చిత్రలేఖనం వంటి అంశాలపై అవగాహన కలిగి వుండాలన్నారు. విశ్రాంత అధ్యాపకుడు సీతారామయ్య, గ్రంథాలయ అధికారి వామాల లక్ష్మణరావు, తేజోమూర్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులకు కోళ్లు పంపిణీ



రైతులకు కోళ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శైలజ

పాయకరావుపేట : మండలంలో గల వి.కొత్తూరు గ్రామంలో రైతులకు ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా యలమంచిలి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో మేకలు, కోళ్లు, మేత తొట్టెలు, నీటి తొట్టెలు పంపిణీ చేయడం జరిగిందని కేవీకే సీఈవో జీ.వి. సత్యనారాయణ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం టీసీటీ, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.శైలజ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ కేవీకే ద్వారా హరిజన రైతులకు ఇస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేవీకే పశు వైద్య శాస్త్రవేత్త డాక్టర్ రజని, వ్యవసాయ యంత్రీకరణ శాస్త్రవేత్త శ్రీకాంత్ రైతులకు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ ప్రసాద్, కోఆర్డినేటర్ సూర్యానారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

ఇంటింటా ధర్మ ప్రచారం



గ్రామాల్లో హిందూ ధర్మ ప్రచారం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు



ఉప్పవరంలో ఇంటింటా ధర్మ ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట : మండలంలో గల పెదరాంభద్రపురం గ్రామంలో బుధవారం ధర్మ ప్రచారం నిర్వహించారు. హిందూ ధర్మ రక్షణకు సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి తిరిగి హిందూ ధర్మంపై ప్రచారం నిర్వహించడం జరుగుతుందని ఫౌండేషన్ మండల కన్వీనర్ తాడి సూరిమూర్తి తెలిపారు. చిన నర్సాపురం గ్రామంలో కూడా సీతారామ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో 50 గడపలకు వెళ్లి సనాతన ధర్మంపై అవగాహన కల్పించారు. ఈ ప్రచార కార్యక్రమంలో సేవా ఫౌండేషన్ కన్వీనర్ మేడిశెట్టి దివాణం, సబ్ డివిజన్ కన్వీనర్ నీలాపు వెంకటరెడ్డి, డివిజన్ ధర్మ ప్రచారక్ కట్టా వీరబాబు పాల్గొన్నారు.

ఉప్పవరంలో ఇంటింటికీ ధర్మ ప్రచారం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని ఉప్పవరంలో బుధవారం ఇంటింటికీ ధర్మ ప్రచారం నిర్వహించారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు మాట్లాడుతూ కుటుంబ సమేతంగా దేవాలయాలను సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కన్వీనర్ చిన్నినాయుడు, గంగిరెడ్డి రోహిత్, ఎస్.భాను, సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



కోటవురట్లలో వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

కోటవురట్ల : వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయుడు మస్తాన్ కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ అప్పలనాయుడు బుధవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. పలువురు విద్యార్థులు పాల్గొని పుస్తక పఠనం చేశారు. మస్తాన్ మాట్లాడుతూ గ్రంథాలయ సందర్శన ద్వారా ప్రపంచ పరిజ్ఞానంతో పాటు చదువు పట్ల ఆసక్తి కలుగుతాయన్నారు. చిన్నతనం నుంచి పోటీతత్వ పరీక్షలకు అలవాటు అవుతుందన్నారు.

ఉపాధికి నిధులు పెంచాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): గ్రామీణఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ పెంచి, కూలీలకు సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము కోరారు. బుధవారం ఆయన అచ్యుతాపురం మండలంలోని ఖాజీపాలెంలో గ్రామీణ ఉపాధి హామీ కూలీలతో సమావేశమై మాట్లాడారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ కూలీల విషయంలో అనేక మార్పులు తీసుకువస్తుందని, ఇది కూలీల పట్ల శరాఘాతంగా మారిందన్నారు. పాత పద్ధతిలో కూలీలకు న్యాయం చేసి, కూలి ధర పెరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవిందు, సుశీల,గంగరాజు, అప్పలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహాయజ్ఞాన్ని విజయవంతం చేయండి

పాయకరావుపేట : ఈ నెల 12 నుండి 17 వరకు విజయవాడలోని ఇందిరా మున్సిపాల్ స్టేడియంలో జరిగే మహాయజ్ఞాన్ని భక్తులందరూ విజయవంతం చేయాలని శ్రీరాధా రుక్మిణీ సహిత పాండురంగ దేవస్థానం కార్యనిర్వాహణాధికారి నరిసే వెంకటాద్రి కోరారు. రాష్ట్ర ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి సంకల్పం మేరకు రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి చేపడుతున్న అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మి మహాయజ్ఞంలో అందరూ పాల్గొని, హోమం తిలకించి, ప్రసాదాలు స్వీకరించాలన్నారు. ఈ మేరకు పట్టణంలో ప్రధాన కూడళ్లలో మహాయజ్ఞం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

13న జాతీయ లోక్ అదాలత్

నర్సీపట్నం: ఈ నెల 13 నిర్వహిస్తున్న మెగా జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కోర్టు కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ న్యాయవాదులు రాజీ పడదగిన కేసుల్లో శ్రద్ధ వహించి ఎక్కువ సంఖ్యలో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ న్యాయవాది వి.బి. రామచంద్రారవు, సీనియర్ న్యాయవాదులు పొక్కునూరు నరసింహం, గొలుసు శంకరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

తాటి ముంజెలకు గిరాకీ



మునగపాకలో తాటిముంజెల అమ్మకాలు

మునగపాక : వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పలువురు తాటి ముంజెలను ఆశ్రయిస్తున్నారు. గ్రామాల్లో దొరికే తాటికాయలతో పాటు ముంజెలను కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. ఇదే అదనుగా అమ్మకందారులు తాటికాయను రూ.10కు విక్రయిస్తున్నారు. డజను ముంజెలను రూ.40 నుంచి రూ.50కు విక్రయిస్తున్నారు. మునగపాక ఎస్‌బీఐ దరి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

వలంటీర్, సచివాలయ వ్యవస్థలు దేశానికే ఆదర్శం

- ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని కోరుకుంటున్నారు
- యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. ప్రజలకు సకాలంలో సేవలందుతున్నాయంటే ఈ రెండు వ్యవస్థలే కీలకంగా మారాయన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు అందిస్తున్న సేవలు మరువలేనివన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల తోడ్పాటుతో ప్రజల్లోకి ప్రభుత్వ కార్యక్రమాలు మరింతగా తీసుకువెళ్లి వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తేడాను ప్రజలకు వివరించి నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేలా చూడాలన్నారు. మా నమ్మకం నువ్వే జగన్... గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలతో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పార్టీ నేతలు పిల్లి అప్పారావు, రామ్మోహనరావు, పాలిమేర గణేష్, వేగి కృష్ణ, పెంటకోట సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలు ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే



ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : ఎన్నికల హామీల అమలు ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం మండలంలోని మూలపేట, మంగళవరపుపేట, మునగపాక గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజా సమస్యలను ఆరా తీసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పేదోడి సొంతింటి కల జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. ఇళ్ల పట్టాలతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు సాయం అందజేస్తామన్నారు. గ్రామాల్లో రహదారులు, డ్రెయిన్ల అభివృద్ధికి సచివాలయ నిధులు కేటాయిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించాలన్నారు. తద్వారా మరిన్ని పథకాలు అందుతాయన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సర్పంచ్‌లు భీశెట్టి గంగప్పలనాయుడు, ఆడారి కృష్ణవేణి, ఉప సర్పంచ్ దేవీచంద్ర, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొడ్డేడ చెల్లయ్యనాయుడు, పార్టీ నేతలు నరసింహనాయుడు, సరిశా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చురుగ్గా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు



మంగళవరపుపేటలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

మునగపాక : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. మంగళవరపుపేటలో రూ.7 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి చురుగ్గా సాగుతుందన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పెత్తనం సాగిందన్నారు. తద్వారా ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు. నేడు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రహదారులు, డ్రైన్లు, తాగునీటి వనరుల అభివృద్ధి జరుగుతుందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ నేతలు సరిసా శ్రీనివాసరావు, కొయిలాడ జగదీష్, భీశెట్టి ధనశ్రీను పాల్గొన్నారు.

జాబ్‌కార్డు కలిగిన అందరికీ పనులు కల్పించాలి



చందనాడలో ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో

నక్కపల్లి : మండలంలో జాబ్ కార్డు కలిగిన వారందరికీ పనులు కల్పించేలా చర్యలు తీసుకున్నామని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. బుధవారం ఆయన చందనాడ, ఎన్.నర్సాపురం గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు వచ్చిన వారి మస్తర్లు తనిఖీ చేశారు. కూలీల సమస్యలు తెలుసుకున్నారు. కూలీలను ఉద్దేశించి మాట్లాడుతూ వేసవి కాలంలో స్థానికంగా ఉపాధి కల్పించేందుకు ఈ పథకం కింద పనులు కేటాయిస్తున్నామన్నారు. జాబ్‌కార్డు కలిగిన వారందరూ ఈ పనులకు హాజరుకావాలన్నారు. వేసవి అలవెన్సుతో కలిసి రూ.272 గిట్టుబాటు అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పంట కాలువలు, చెరువుల్లో పూడికతీత, చెరువుగట్లు పటిష్టం, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు ప్రస్తుతం చేపడుతున్నామన్నారు. పనులు జరిగే ప్రాంతాల్లో తాగునీటి సదుపాయం కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. పనులకు వచ్చిన వారికి మాత్రమే మస్తర్లు వేయాలన్నారు. పనులు చేసే సమయంలో వడదెబ్బకు గురికాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలన్నారు. పీహెచ్‌సీల్లో ఇవి అందుబాటులో ఉన్నాయన్నారు. ఎండ ఉధృతం కాకుండానే పనులు ముగించుకోవాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు పనులు రోజూ పర్యవేక్షించాలన్నారు.

నాలుగు రోజులుగా కరెంట్ లేక అవస్థలు

ఎస్.రాయవరం : రేవుపోలవరం, కొత్తరేవుపోలవరం గ్రామాల్లో నాలుగు రోజులుగా కొన్ని వీధుల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లైన్‌మన్, ఏఈలు ఫోన్‌లో అందుబాటులో లేకపోవడంతో ఉప సర్పంచ్ చోడిపల్లి గోవిందుతో కలిసి విద్యుత్ సబ్ ఇంజనీర్‌కి సమస్యను వివరించారు. సమస్య చెబుతుంటే లైన్‌మన్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేస్తున్నారని, ఏఈ సమాధానం కూడా ఇవ్వడంలేదని అన్నారు. దీంతో వెంటనే సబ్ ఇంజనీర్ ఏఈకి ఫోన్‌లో సమాచారం తెలియజేయగా, సమస్య సరిచేసేందుకు సిబ్బందిని పంపిస్తామని చెప్పారు. దీంతో గ్రామస్తులు వెనుతిరిగారు. తమ కాలనీల్లో కొన్నేళ్లుగా విద్యుత్ సమస్యలున్నా పూర్తి స్థాయిలో పరిష్కారం చేయడం లేదని అందువల్లే అప్పుడప్పుడూ రోజుల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



దిమిలిలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో శిరీషారాణి

రాంబిల్లి : పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని డీపీవో శిరీషారాణి అన్నారు. దిమిలిలో బుధవారం ఆమె సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ గ్రామంలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య పనులను నిర్వహించారు. ఈ పనులను డీపీవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ నాగలక్ష్మి, సర్పంచ్ బంగారు చిలుకు, పంచాయతీ కార్యదర్శి రాజుబాబు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్ :
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com